క్లుప్తంగా

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేషపూజలను దేవస్థానం అధికారులు, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

ఉద్యోగులకు సమయపాలన ముఖ్యం



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పాములపాడు: గ్రామ సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని మిట్టకందాల, మద్దూరు, వాడాల గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు పట్టీలను తనిఖీ చేశారు. ఎంఎస్ఎంఈ సర్వే, మిస్సింగ్ సిటిజన్ మ్యాపింగ్, పీపీసీఎస్ ఈకేవైసీ సర్వేలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వేల్లో పురోగతి కనిపించకపోతే తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పనిసరి అని తెలిపారు.

నిర్మాణాల్లో నాణ్యత తప్పనిసరి



పశువుల షెడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాములపాడు: మినీ గోకులం షెడ్లను నాణ్యతతో నిర్మించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నా రు. గురువారం మండలంలోని మద్దూరు గ్రామంలో మహ్మద్ఉసేన్, విశ్వప్రభ, నరసింహులు నిర్మిస్తున్న షెడ్లను పరిశీలించారు. నిర్మాణం పూర్తయిన వాటికి వెంటనే బిల్లులు ఇస్తామని చెప్పారు. ఒక్కో షెడ్డుకు రూ.2,30,000 మంజూరైనట్లు వివరించారు. ఆయన వెంట ఏపీఓ విమలమ్మ, జేఈ రమేష్‌నాయుడు తదితరులు ఉన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ

పగిడ్యాల: స్థానిక మండల విద్యాధికారి కార్యాలయంలో ఎంఈఓ సుభాన్ చేతుల మీదుగా 2025 యూటీఎఫ్ క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ముర్తుజావలి మాట్లాడుతూ.. ఈనెల 5,6,7,8 తేదీల్లో కాకినాడలో జరిగే యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయా లని కోరారు. ఉపాధ్యాయులకు అవసరమైన సర్వీస్ జీవోలను డైరీలో పొందుపర్చామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంగస్వామి, సత్యనారాయణ, నాయకులు కాసీం, మల్లికార్జున, అబుకాశీం, వెంకటరాముడు, ఆసీఫ్, అనురాధ, హైమావతి, సుజాత, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం

వెలుగోడు: ఉపాధ్యాయ, విద్యారంగా సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ నిరంతరం పోరాటాలు చేయడం సంతోషకరమని ఎంఈఓ బ్రహ్మం నాయక్ అన్నారు. పట్టణంలోని ఎంఆర్సీ భవనంలో గురువారం యూటీఎఫ్ 2025 క్యాలెండర్, డైరీ ఆవిష్కరించారు. అనంతరం కాకినాడలో జరిగే యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి జాకీర్ హుస్సేన్, గౌరవ అధ్యక్షుడు రామకృష్ణ, ఆడిట్ కమిటీ సభ్యులు జేఎండీ రఫీ తదితరులు పాల్గొన్నారు.

9న సర్వసభ్య సమావేశం

పాములపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 9వ తేదీ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలన్నారు. అలాగే ఎంపీపీ, జెడ్పీటీసీ, అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.

రోడ్లపై ప్రయాణించతరమా!



అక్కమహాదేవి సెంటర్ వద్ద గుంతలమయమైన రోడ్డు (ఇన్‌సెట్)పాతమార్కెట్ వద్ద చిత్తడిగా మారిన రోడ్డు

శ్రీశైలం మండల కేంద్రమైన సున్నిపెంటలో ప్రధానరోడ్లను వేసి దాదాపు 25 సంవత్సరాలకు పైగానే అయ్యింది. గ్రామంలోని అన్ని రోడ్లు పాడైపోయి గుంతలమయమయ్యాయి. ఈ రోడ్లపై నడవాలన్నా, వాహనాలపై వెళ్లాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సిందే. వర్షం వచ్చిందంటే గుంతల్లో నీరు చేరి నిలబడిపోతున్నాయి. ప్రధానరోడ్లకు ఇరువైపులా డ్రైనేజీలపై అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో మురుగు నీరు సైతం రోడ్లపైకి వచ్చి చేరుతోంది. గ్రామంలో ఏ ప్రధాన రోడ్డును చూసినా అన్నీ గుంతలమయంగానే ఉన్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు సున్నిపెంట రోడ్ల నిర్మాణానికి పూనుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– శ్రీశైలంప్రాజెక్ట్



అంబేడ్కర్ సెంటర్ వద్ద గుంతలమయమైన రోడ్డు

రోడ్లకు మరమ్మతులు చేయాలి

కొత్తపల్లి: మండలంలో దెబ్బతిన్న ఆర్అండ్‌బీ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వి.యేసురత్నం, మండల కార్యదర్శి ఎన్.స్వాములు డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు. ఆత్మకూరు నుంచి సంగమేశ్వరం రోడ్డుని బావాపురం, లింగాపురం, నందికుంట వద్ద రోడ్లు అధ్వానంగా ఉన్నాయని తెలిపారు. అలాగే ఆత్మకూరు నుంచి దుద్యాల, కొత్త మాడుగుల, కొక్కెరంచ గ్రామాల రోడ్లు గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నట్లు చెప్పారు.

20 నుంచి మస్తాన్‌వలి ఉరుసు

పాములపాడు: మండలంలోని కంబాలపల్లి గ్రా మంలో మస్తాన్‌వలి ఉరుసును ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ముజావర్ బాదర్ల సాహెబ్ తెలిపారు. గురువారం దర్గా ఆవరణలో కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముజావర్ మాట్లాడుతూ.. ఎప్పటి లాగే ఈ ఏడాది కూడా ఉరుసును ఘనంగా నిర్వహిస్తామని.. ఇందుకు కమిటీ సభ్యులు సహకరించాలని కోరారు. ఫిబ్రవరి 20వ తేదీ గంధోత్సవం, 21న ఉరుసు, 22న ప్రసాద వితరణ కార్యక్రమాలు జరుగుతాయని వెల్లడించారు. సమావేశంలో కమిటీ పెద్దలు మంజుల వెంకటస్వామి, మహబూబ్ సాహెబ్, లింగన్న, అబ్దుల్ ఖాదర్, షేక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగులో మెలకువలు అవసరం



నందికుంటలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు

కొత్తపల్లి: రైతులు పంటలసాగులో మెలకువలు పాటిస్తే మంచి దిగుబడులతో పాటు తెగుళ్లను నివారించవచ్చని నంద్యాల జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి కె.హేమలత అన్నారు. గురువారం మండలంలోని నందికుంట, గువ్వలకుంట్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పంట పొలాలను సందర్శించి తెగుళ్ల నివారణపై తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. మినుము, కంది పంటలో సస్యరక్షణపై అవగాహన కల్పించారు. ఖరీఫ్ సీజన్‌లో కంది పంట సాగుచేసిన రైతులు రైతు సేవా కేంద్రంలో కందుల కొనుగోలు కోసం ముందస్తుగా నమోదు చేయించుకోవాలని తెలిపారు. అదే విధంగా సహకార పరపతి సంఘాల్లోని రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. విత్తనశుద్ధి ఆవశ్యకతను తెలియజేశారు.పొలంలో అక్కడక్కడా జిగురు పసుపు రంగు రేకులు, అట్టలు ఉంచుకోవాలని సూచించారు. కందిలో వచ్చే ఎండుతెగులు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు. మండల వ్యవసాయాధికారి మహేష్, ఎంపీటీసీ సభ్యుడు బాలరాజు, గ్రామ వ్యవసాయ సహాయకులు శివకృష్ణ నాయక్, జాహిద్, పశుసంవర్ధక సహాయకుడు శివనాయక్ పాల్గొన్నారు.

వన్ ఆర్ తూము పరిశీలన

వెలుగోడు: వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో అంతర్భాగమైన వన్ ఆర్ తూమును ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి గురువారం సాయంత్రం పరిశీలించారు. ఇటీవల వన్ ఆర్ తూము గేటు ఎత్తే సమయంలో లింకు కింద పడిపోవడంతో మరమ్మతుకు గురైంది. దీంతో రైతులు, నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో వన్ అర్ తూమును పరిశీలించిన అనంతరం వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు.

భూముల రీ సర్వేపై అవగాహన ర్యాలీ



వేల్పనూరు గ్రామంలో రీ సర్వే పై ర్యాలీ చేపట్టిన రెవెన్యూ అధికారులు

వెలుగోడు:భూముల రీ సర్వేపై వేల్పనూరు గ్రామంలో గురువారం రెవెన్యూ అధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భూ రికార్డుల విషయంలో సమూల మార్పునకు శ్రీకారం చుట్టిందన్నారు. రీ సర్వే ప్రాజెక్ట్ లో భాగంగా వేల్పనూరు గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టామన్నారు. రీసర్వే వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ ఉపేంద్ర, రెవెన్యూ, సర్వే శాఖ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గోకులం షెడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి గోవిందనాయక్

పగిడ్యాల: గోకులం షెడ్ల నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతం చేయాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి గోవింద నాయక్ అన్నారు. గురువారం మండలంలోని పాత, కొత్త ముచ్చుమర్రి, నెహ్రూనగర్, పీకే ప్రాగటూరు గ్రామాల్లోని షెడ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకున్న వెంటనే బిల్లులు బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతాయని చెప్పారు. ఈనెల 12వ తేదీలోగా నిర్మాణాలన్ని పూర్తి చేసుకునేలా ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం ముచ్చుమర్రి గ్రామంలో జరిగే గొంతువాపు నిరోధక టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే శాఖాపరంగా పశుపోషకులకు అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. లక్ష్యాలను పూర్తి చేసేందుకు సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని తెలిపారు. ఆయన వెంట జూపాడుబంగ్లా డివిజన్ పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు రామాంజినాయక్, పశువైద్యులు రాగసంధ్య, ఈసీ అశోక్, టీపీ వసుంధర, వీరేష్, చరిత తదితరులు ఉన్నారు.

డిగ్రీ కాలేజీ క్యాంటీన్ ప్రారంభం



క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ హుస్సేన్‌బాషా

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్యాంటీన్‌ను గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.హుస్సేన్‌బాషా ప్రారంభించారు. కళాశాల అలూమినీ (పూర్వవిద్యార్థుల) అసోసియేషన్ నిర్వహించే ఈ క్యాంటీన్‌ను కళాశాల విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు రాజశేఖర్, శ్యాం, విజయ్, ప్రసాద్, అధ్యాపకులు డా.కె.బుచ్చయ్య, డా.రాజన్న, మహేశ్వరరెడ్డి, ప్రజాప్రతినిదులు ఉమామహేశ్వరరావు, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ విజేత శకునాల జట్టు



విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న ఏబీఎం సంఘ పెద్దలు

జూపాడుబంగ్లా: నూతన సంవత్సరం సందర్భంగా భాస్కరాపురం ఏబీఎం సంఘం అధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో శకునాల జట్టు విజయకేతనం ఎగురవేసింది. పోటీల్లో 36 జట్లు తలపడగా శకులనాల జట్టు మొదటి స్థానంలో నిలిచి రూ.30 వేలు కైవసం చేసుకుంది. ప్రాతకోట టీం ద్వితీయ స్థానంలో నిలిచి రూ.20 వేలు చేజిక్కించుకుంది. వడ్డెమాను జట్టు తృతీయస్థానంలో నిలిచి రూ.10వేలు అందుకుంది. అర్ఎస్ రంగాపురం జట్టు నాల్గో స్థానంలో నిలిచి రూ.5 వేలు గెలుపొందింది. విజేతలకు ఏబీఎం సంఘ పెద్దలు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గొల్లగోవిందు, ఉసేనయ్య, జయరాముడు, డాక్టర్ వినోద్, విజ్జి, స్వామన్న, రమేష్‌బాబు, సురేష్, మధుసూదన్, రాముడు, సుంకన్న, వెంకటరమణ, ఇంద్రుడు, రామకృష్ణ, ఏసన్న, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యా కమిటీ చైర్మన్‌లకు శిక్షణ

పగిడ్యాల: స్థానిక మండల విద్యాధికారి కార్యాలయంలో గురువారం ఎంఈఓ సుభాన్ అధ్యక్షతన విద్యా కమిటీ చైర్మన్‌ల ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌పీలు రంగస్వామి, సత్యనారాయణ మాట్లాడుతూ.. విద్యా కమిటీ చైర్మన్‌లు తమ విధులను తెలుసుకుని పాఠశాల అభ్యున్నతికి పాటుపడాలని కోరారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారా లేదా విజిట్ చేయవచ్చునని సూచించారు. అలాగే మధ్యాహ్న భోజనం నిర్వహణపై కూడా అజమాయిషీ కలిగి పిల్లలకు సమతుల పౌష్టికాహారం అందేలా చూడాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. మౌలిక సదుపాయాలపై జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చునని అవగాహన కల్పించారు. ఎంఈఓ–2 మురళీమోహన్‌రెడ్డి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్‌లు పాల్గొన్నారు.

ప్రజా కళాకారుడు సర్దార్ హష్మీ



సర్దార్ హష్మీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

ఆత్మకూరు: నాటక ప్రదర్శనలోనే ఢిల్లీ నడిబొడ్డులో నేలరాలిన సింధూరం, కళా సైనికుడు సర్దార్ హష్మీ అని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యేసురత్నం, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు, నాయకులు కె.జె.చంద్రశేఖర్ అన్నారు. గురువారం పట్టణంలోని డాక్టర్ ఎ.ధనుంజయ మీటింగ్ హాల్‌లో సర్దార్ హష్మీ వర్ధంతి సందర్భంగా ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఎ.రణధీర్, సుధాకర్, డి.రామ్‌నాయక్, షేక్‌ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

బహుళ పంటలతో రైతులకు లాభాలు



పంట పొలాల్లో రైతులకు సూచనలిస్తున్న ఏఓ పవన్

వెలుగోడు: ఏకపంట కాకుండా బహుళ పంటలు వేసుకోవడం వలన రైతులకు ఆర్థికంగా లాభాలు ఉంటాయని ఏఓ పవన్ కుమార్ తెలిపారు. మండలంలోని వేల్పనూరు, రేగడగూడూరు గ్రామాలలో గురువారం రైతు సేవా కేంద్ర పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రబీ సీజన్‌లో మండల పరిధిలోని రైతులందరూ పంట నమోదు చేసుకోవాలని, తద్వారా ప్రభుత్వం అందించే రాయితీలకు అర్హులవుతారన్నారు. మినుము పంటలో పల్లాకు తెగులు ఉధృతి ఉన్నచోట సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, వరి పంట సాగులో సూడోమోనాస్ బయోపెస్టిసైడ్ పిచికారీ చేసుకోవడం వలన నెల రోజుల నుంచి సంక్రమించే తెగుళ్లు 20 నుంచి 30 రోజుల పాటు తగ్గించుకోవచ్చన్నారు. నార కొనలు తుంచి నాటుకోవడం వలన కాండం తొలుచు పురుగు ఉధృతిని తగ్గించుకో వచ్చని, అంతే కాకుండా పిలకలు అధికంగా వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ సుధారాణి గ్రామ వ్యవసాయ సహాయకులు మహేంద్ర, స్వర్ణలత, లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

రైతులను మోసగించిన వారిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ నాయకులు

నందికొట్కూరు: రైతుల శనగలను అక్రమంగా అమ్మేసుకున్న వారిని వెంటనే అరెస్టు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.నరసింహులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఐఎంఎల్ పార్టీ కార్యాలయంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. చిప్పగిరి మండలంలో మారుతి వేర్‌హౌస్ గోడౌన్‌లో రైతులు దాచుకున్న శనగ బస్తాలను అక్రమంగా అమ్మేసుకున్న అనంతపురం జిల్లా విడపనకల్లు మండలం దోనేకల్లుకు చెందిన బీజేపీ నేతలు నారాయణస్వామి, అతనికుమారుడు వెంకటరమణపై చర్యలు తీసుకోవాలని కోరారు. సుమారు రూ.20 కోట్ల వరకు మోసం జరిగిందని ఆరోపించారు.

వృద్ధాశ్రమంలో నూతన సంవత్సర వేడుకలు



మానవతా వృద్ధాశ్రమంలో కేకు కట్ చేస్తున్న సీఐ రాము

ఆత్మకూరు: మండలంలోని కరివేన గ్రామంలోని ఎస్ఆర్‌బీసీ కాలనీలో ఉన్న మానవతా నిలయం వృద్ధాశ్రమంలో గురువారం ఆత్మకూరు టౌన్ సీఐ రాము నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. వృద్ధుల మధ్య కేకు కట్ చేసి వారికి తినిపించారు. సీఐ మాట్లాడుతూ వేదాల్లో, ఉపనిషత్తుల్లో, దివ్య ఖురాన్లో, బైబిల్‌లో ఏ గ్రంథంలో చూసినా పేదల ఆకలి తీర్చమని, వారికి తోచిన సాయం చేయాలని ఉందన్నారు. ప్రతిఒక్కరూ మానవసేవయే మాధవసేవ అని భావించి సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మానవతా వృద్ధాశ్రమం నిర్వాహకులు బేతం, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

వేప మొదలులో మర్రి మొలిచెన్



ఆత్మకూరురూరల్: 'ఇనుములో హృదయం మొలిచెనే' అంటూ గతంలో ఓ సినీ కవి హోయలు పోయాడు. కానీ ఇక్కడ ఒక వేప చెట్టు తన మొదలుపై గాలివాటున పడిన మర్రి విత్తనానికి మొలిచేందుకు అనుమతినివ్వడంతో అది చక్కగా మొలకెత్తింది. వేప చెట్టు మొదట్లో మొలచిన మర్రి మొక్క కొత్తపల్లె మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా చూపరులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

వేప చెట్టుపై మొలిచిన మర్రి మొక్క

పరిష్కారం చూపని రెవెన్యూ సదస్సులు



తహసీల్దార్ పద్మావతికి వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

బండి ఆత్మకూరు: గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు భూ సమస్యలకు పరిష్కారం చూపడం లేదని రైతు సంఘం నాయకులు సుధాకర్ రెడ్డి, సీఐటీయూ నాయకులు రత్నమయ్య ఆరోపించారు. గురువారం పార్నపల్లి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలకు పరిష్కారం చూపాలని తహసీల్దార్ పద్మావతికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ... మండల రెవెన్యూ యంత్రాంగం గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సదస్సులు నిర్వహిస్తున్నా ఆశించిన స్థాయిలో దరఖాస్తులు ఎందుకు రావడం లేదో గుర్తించాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నవంబర్ నెలలో నిర్వహించిన గ్రామ సభల్లో మండల వ్యాప్తంగా దాదాపు 1,150 దరఖాస్తులు రాగా, అందులో కొన్నింటికి కూడా పరిష్కారం చూపలేదన్నారు. మళ్లీ ఇప్పుడు రెవెన్యూ సదస్సుల పేరుతో గ్రామాల్లో సభలు ఏర్పాటు చేయడంతో ప్రజలు ఆశక్తి చూపడం లేదన్నారు.

వివాదాస్పదమైన షరాఫ్ వేలం



పోలీసుల బందోబస్తు మధ్య వేలం పాట నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

పగిడ్యాల: ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మాపురం గ్రామంలో గురువారం చేపట్టిన షరాఫ్ వేలం వివాదాస్పదమైంది. ఏటా జనవరి 2వ తేదీ గ్రామ రైతు కమిటీ సభ్యులు పెద్దమనుషులుగా ఎన్నుకునే సంప్రదాయం ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. అధికార పక్షం, ప్రతిపక్షం నుంచి అవసరమైన మేరకు గ్రామ పెద్దలను ఎన్నుకుని గ్రామ సరాఫ్ వేలాలు నిర్వహించడం పరిపాటి. అయితే ఈ ఏడాది పెద్దమనుషుల ఏర్పాటు వివాదాస్పదమైంది. అధికార టీడీపీ తరుపున ఎమ్మెల్యే వర్గీయులు కుమ్మరి గోవిందు, మద్దిలేటి గౌడ్ మరికొంత మంది, అలాగే మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి తరుపున పగడం రాఘవ, సురేష్‌రెడ్డి, మహ్మద్‌బాషా, శేఖర్, మరికొందరు గ్రూపుగా ఏర్పాటై రాష్ట్రంలోనే ప్రతిపక్షం లేదు ఇక్కడెందుకు ప్రతిపక్షం అంటూ సమస్యను లేవనెత్తారు. గతం నుంచి కొనసాగుతూ వస్తున్న సంప్రదాయాన్ని పాటించాల్సిందేనని తమ పార్టీ తరుపున పెద్దమనుషులు ఉంటారని వైఎస్సార్‌సీపీ నాయకులు పట్టుబట్టారు. దీంతో ఇరువర్గాల మధ్య మాటల తూటాలు పేలి ఉద్రిక్తతకు దారి తీసింది. గ్రామ పెద్దల నియామకంలో వైఎస్సార్‌సీపీకి స్థానం లేదని కేవలం ఎమ్మెల్యే వర్గం, బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి వర్గం నుంచే పెద్ద మనుషులను ఎన్నుకుంటామని పోలీసు బందోబస్తు మధ్య పూర్తి చేశారు. ఈ వేలం పాటలో అత్యధికంగా రూ. 95 వేలకు పాట పడిన పుష్పరాజ్ సరాఫ్‌ను దక్కించుకోవడం విశేషం. అయితే ఎల్లకాలం ఒకే ప్రభుత్వం మనుగడ సాగించదని వైఎస్సార్‌సీపీ నేతలు వేలం పాటల నుంచి నిష్క్రమించారు.

రీసర్వే ప్రాజెక్ట్‌పై ర్యాలీ

పగిడ్యాల: సమగ్ర భూ రీసర్వే ప్రాజెక్ట్‌పై తహసీల్దార్ శివరాముడు ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ చేపట్టారు. భూ రికార్డుల స్వచ్ఛీకరణలో భాగంగా నిర్వహిస్తున్న రీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పిలుపునిచ్చారు. మండలంలోని పగిడ్యాల గ్రామం పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపికైందని తెలిపారు. గ్రామంలోని చిన్న, సన్నకారు రైతులకు పొలం హద్దులు చూపించేందుకు ప్రతి ఒక్కరికీ నోటీసులు పంపుతామని పేర్కొన్నారు. నోటీసులు అందుకున్న రైతులు పొలం సరిహద్దులు చూపిస్తే విస్తీర్ణంను కొలతలు వేసి నంబరు రాళ్లు వేస్తారన్నారు. వందేళ్ల క్రితం బ్రిటీష్ ప్రభుత్వ హయాంలో జరిగిన సర్వే కాబట్టి సరిహద్దు రాళ్లు చాలా చోట్ల లేవన్నారు. రీ సర్వే ద్వారా రైతులకు ప్రయోజనం చేకూరుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుమిత్రమ్మ, ఈఓఆర్డీ నాగేంద్రయ్య, సర్వే డిప్యూటీ తహసీల్దార్ మురళీ, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి, వీఆర్వో నాగన్న, సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, గ్రామ పెద్దలు దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉసేన్‌స్వామి దర్గాలో భక్తుల రద్దీ

కోవెలకుంట్ల: రేవనూరు గ్రామంలో వెలసిన ఉసేన్‌స్వామి దర్గాకు గురువారం భక్తులు పోటెత్తారు. జిల్లాతోపాటు ఇతర జిల్లాల నుంచి భక్తులు తరలిరావడంతో కిటకిటలాడింది. భక్తులు స్వామివారికి పూల దట్టీలు, జెండాలను ఊరేగింపుగా తీసుకొచ్చి ఫతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

భూ సమస్యలను పక్షం రోజుల్లో పరిష్కరిస్తాం



దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, సర్వేయర్

జూపాడుబంగ్లా: రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు ఇచ్చిన భూసమస్యల దరఖాస్తులను పక్షం రోజుల్లోగా పరిష్కరిస్తామని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ తెలిపారు. గురువారం మండలంలోని పోతులపాడు గ్రామ సచివాలయంలో సర్పంచ్ పల్లెనిర్మలమ్మ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. గ్రామాల్లోని రైతుల భూసమస్యలను రెవెన్యూ సదస్సుల్లో లిఖిత పూర్వకంగా తగిన ఆధారాలతో తెలియజేస్తే పరిష్కరిస్తామన్నారు. అనంతరం రైతుల నుంచి భూసమస్యల దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నాగన్న, సర్వేయర్ అతీఫ్, వీఆర్వోలు మాధవి, శివానందరెడ్డి, విలేజ్ సర్వేయర్ అక్తర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే సదస్సులు

పాములపాడు: భూములకు సంబంధించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సుభద్రమ్మ తెలిపారు. గురువారం మండలంలోని మద్దూరు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సమస్యలను అర్జీల రూపంలో ఇవ్వాలని రైతులకు సూచించారు. అర్జీలను పరిశీలించి త్వరితగతిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వివ రించారు. అనంతరం రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆన్‌లైన్ నమోదు చేయాలంటూ ఇద్దరు రైతులు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పఠాన్‌బాబు, రీసర్వే డీటీ సుప్రియ, ఆర్ఐ ఖాజాబీ, వీఆర్వో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 4 వినతులు

మిడుతూరు: మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 4 వినతులు వచ్చినట్లు డిప్యూటీ తహసీల్దార్ కిశోర్ కుమార్ రెడ్డి తెలిపారు. రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.